క్లుప్తంగా

పిల్లలపై నిఘా ఉంచాలి


మాట్లాడుతున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చోళ్లవీడు, చినగానిపల్లె, ఆకవీడు, అచ్చంపేట, అక్కపల్లె, జేపీ చెరువు గ్రామాల్లోని చెరువులు, కుంటలకు నీరు చేరుతోంది. ప్రస్తుతం దసరా సెలవుల్లో ఇంటి వద్ద ఉన్న పిల్లలు సరదాగా చెరువులు, కుంటలు, కాలువల్లో ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.కోటేశ్వరరావు సూచించారు. స్నేహితులతో కలిసి బయటకు వెళ్లకుండా పిల్లలపై నిఘా ఉంచాలని కోరారు. ప్రస్తుతం జేపీ చెరువు గ్రామ సమీపంలోని గుండ్లకమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ఆ ప్రాంతానికి ఎవరు వెళ్లకుండా నిషేధం విధించామని ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్ఎస్ నూతన లైన్ల ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో కొమరోలు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మిట్టమీదిపల్లె, బ్రాహ్మణపల్లె, యర్రపల్లె గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అబ్దుల్‌ఖాదర్‌కు ఘన సన్మానం


అబ్దుల్‌ఖాదర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కంభం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న డి.అబ్దుల్ ఖాదర్‌ను ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులతో కలిసి సత్కరించారు. విధినిర్వహణలో ప్రజల మన్ననలు పొందిన అబ్దుల్ ఖాదర్ ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొందడం హర్షణీయమని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనాథ మహిళకు అంత్యక్రియలు


అంత్యక్రియల్లో పాల్గొన్న సామాజిక సేవకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఓ అనాథ మహిళ అనారోగ్యం కారణంగా మృతి చెందగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లా రవీంద్రనగర్‌కు చెందిన ఖాశింబీ(59) అనారోగ్యం పాలవడంతో కుటుంబ సభ్యులు చేరదీయకుండా వదిలేశారు. దీంతో ఒంటరైన ఖాశింబీ భిక్షాటన చేసుకుంటూ గిద్దలూరు పట్టణానికి చేరుకుంది. ఇక్కడి రైల్వే స్టేషన్ సమీపంలో గత కొంత కాలంగా ఉంటున్న ఆమె యాచించగా వచ్చిన సొమ్ముతో నాలుగు మెతుకులు తింటోంది. ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో ఆమె మృతి చెందగా.. నారాయణరెడ్డి, మరికొందరు ముస్లింలు ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న అందె నాసరయ్య

మార్కాపురం: కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అందె నాసరయ్య, నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాశీం పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భవించి నూరేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 21 నుంచి 25 వరకు చండీగఢ్‌లో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవ, హరిబాబు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


చోళ్లవీడు టూటౌన్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు


చోళ్లవాడు వద్ద గుండ్లకమ్మ వాగు ప్రవాహాన్ని తిలకిస్తున్న స్థానిక ప్రజలు

పశ్చిమాన కుండపోత

- నల్లమలతోపాటు శనివారం అర్ధరాత్రి భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగువంకలు

వర్షపాతం వివరాలు

మండలం	వర్షం(మి.మీలో)
మార్కాపురం	27.2
పెద్దారవీడు	38.6
దోర్నాల	18.4
వైపాలెం	16.6
త్రిపురాంతకం	39.4
పుల్లలచెరువు	60.4
కంభం	22.6
బేస్తవారిపేట	27.4
అర్ధవీడు	30.4
గిద్దలూరు	27
రాచర్ల	18.4
కొమరోలు	29.8
తర్లుపాడు	64.2


మార్కాపురం పట్టణంపై కమ్ముకున్న కారుమబ్బులు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో శనివారం అర్ధరాత్రి వాన దంచికొట్టింది. పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొరుతున్నాయి. ఆదివారం కూడా పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల సమయంలో మార్కాపురం ప్రాంతాన్ని మబ్బులు కమ్మేసి చీకటి వాతావరణం ఏర్పడింది. గత పది రోజులుగా ఎండలు ఠారెత్తిస్తుండటంతో పత్తి, మొక్కజొన్న, కంది పంటలు క్రమంగా ఎండుముఖం పట్టాయి. ఈ తరుణంలో వర్షాలు కురవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

కాటంరాజు గుడి అభివృద్ధికి కృషిచేద్దాం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రమేష్‌యాదవ్


రమేష్ యాదవ్‌ను సన్మానిస్తున్న పీఎల్‌పీ యాదవ్ తదితరులు

మార్కాపురం: వేనూతల కాటంరాజు గంగా భవానీ దేవస్థానం అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషిచేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, అఖిల భారత యాదవ మహాసంఘం రాష్ట్ర సెక్రటరీ బొడ్డు రమేష్‌యాదవ్ అన్నారు. మార్కాపురం బీసీ భవన్‌లో వేనూతల కాటంరాజు గంగాభవానీ దేవస్థానం కమిటీ ముఖ్య బాధ్యులు, యాదవ మహాసంఘం జాతీయ క్రమశిక్షణ సంఘం, వైఎస్సార్ సీపీ నాయకుడు పిన్నిక లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో రమేష్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాదవ సోదరులు దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రమేష్ దేవస్థానం అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బుర్రి చిన్నవెంకటేశ్వర్లు, జీవీ సుబ్బారావు, మెట్ల చెంచయ్య యాదవ్, బొరిగొర్ల గాలెయ్య, నాగం వెంకటేష్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మాతృమూర్తికి ఘన నివాళి


మల్లమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

తర్లుపాడు: మండలంలోని మీర్జాపేట మాజీ సర్పంచ్ తాతిరెడ్డి మల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు రంగారెడ్డి మాతృమూర్తి మల్లమ్మ(90) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, జంకె వెంకటరెడ్డి మీర్జాపేటలో మల్లమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీకి ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కాశయ్య, రామిరెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, పార్టీ నాయకులు వెలుగొండారెడ్డి, గాయం వెంకటేశ్వరరెడ్డి, శేషయ్య, భాస్కర్‌రెడ్డి, వెన్న సత్యనారాయణరెడ్డి, గాలిరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం


బలరామిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న సహోద్యోగులు

అర్ధవీడు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన బండి బలరామిరెడ్డిని ఆదివారం కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా అకడమిక్ జాయింట్ సెక్రటరీ ఎస్.సంజీవరావు హాజరయ్యారు. ప్రకాశం జిల్లాలోని వివిధ కళాశాలల్లో బలరామిరెడ్డి 30 ఏళ్లకు పైగా సేవలందించి గుర్తింపు పొందారని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాల్ దంపతులను సహచర ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా

- నోటీసులివ్వాలని ఎంపీడీఓకు ఎంపీపీ సూచన


అర్ధవీడు సభలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట్రావు

అర్ధవీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖ అధికారులు డుమ్మా కొట్టడంపై ఎంపీపీ మేడూరి వెంకట్రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో 35 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా వీరిలో మందికిపైగా గైర్హాజరయ్యారు. దీంతో సమావేశానికి రాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓకు ఎంపీపీ సూచించారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. విద్యుత్ శాఖ పనితీరుపై ఎంపీపీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం గత 4 నెలలు ఎంత మంది డీడీలు చెల్లించారు, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకా ఎంత మందికి ఇవ్వాల్సి ఉందనే వివరాలు తెలియజేయాలని రాతపూర్వకంగా కోరినా ఎందుకు స్పందించడం లేదని ఏఈని నిలదీశారు. అర్ధవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటుకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారిని ఎంఈఓ ఇంకొల్లు సుజాత కోరారు. నీళ్ల బిల్లులు ఎందుకు మంజూరు చేయడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సర్పంచ్‌లు కందుల రామకృష్ణారెడ్డి, అటకారి వెంకటేశ్వర్లు, జి.నాగిరెడ్డి ప్రశ్నించారు. వెలగలపాయలో మంచి నీటి బోరును టీడీపీ నాయకులు తమ పొలాలకు ఉపయోగించుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామ నాయకులు ఎంపీడీఓను నిలదీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు విజయమ్మ, ఎంపీడీఓ వీరరాజు, వైస్ ఎంపీపీ చందా సుబ్బారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మొన్న నిండింది.. నేడు ఎండింది!

- రోజుల వ్యవధిలోనే అడుగంటిన అచ్చంపేట చెరువు
- గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తున్నా నీరు చేరని వైనం


ప్రస్తుతం నీరు అడుగంటిన స్థితిలో చెరువు


ఆగస్టు 13న నీటితో కళకళలాడుతున్న అచ్చంపేట చెరువు

రాచర్ల: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి చెరువులు ఎండుముఖం పడుతున్నాయి. ఆగస్టులో నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాచర్ల మండలంలోని చినగానిపల్లె పంచాయతీ అచ్చంపేటలో పంచాయతీ రాజ్ చెరువుకు భారీగా నీరు చేరింది. గత 20 రోజులుగా భానుడు నిప్పులు చెరగడంతో చెరువులో నీరు క్రమంగా ఇంకిపోవడంతో పాటు ఆవిరైంది. శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి గుండ్లకమ్మ పోటెత్తినా అచ్చంపేట చెరువుకు నీరు చేరడం లేదు. పంట కాలువలు సక్రమంగా లేకపోవడం వల్లే నీరు చేరడం లేదని స్థానిక రైతులు చెబుతున్నారు. పంట కాలువకు మరమ్మతుల విషయమై ఇరిగేషన్ ఏఈ సుధాకర్‌కు వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కిక్కిరిసిన బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు!

- దసరా సెలవుల నేపథ్యంలో విపరీతమైన రద్దీ
- సరిపడా బస్సులు తిప్పడం లేదని ఆర్టీసీపై జనాగ్రహం


కొమరోలులో రద్దీగా ఉన్న బస్సులో ఎక్కేందుకు ప్రయాణికుల తంటాలు

కొమరోలు: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉన్న బస్సుల్లో ఎక్కేందుకు అవకాశం లేకపోవడంతో ఆటోలు ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సోమవారం నుంచి దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచే ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. సాధారణ ప్రయాణికులతోపాటు సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు బయలుదేరినవారు బస్సుల్లో ఖాళీ లేక గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. కొమరోలు మండలానికి ఆర్టీసీ తక్కువ ట్రిప్పులు నడుపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణానికి ఇబ్బంది లేకుండా బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీలు రాజకీయ చైతన్యం సాధించాలి


బీసీల సమావేశంలో ఐక్యత తెలియజేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: బీసీలు రాజకీయంగా చైతన్యం సాధించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకుడు కేశన శంకరరావు పేర్కొన్నారు. గిద్దలూరులోని స్ప్రింగ్ బోర్డు ఆవరణలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘ నియామక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ రాజకీయంగా చైతన్యవంతులు కావాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్, మంత్రిత్వ శాఖ ఏర్పాటు, హక్కులు సాధించుకునేందుకు బీసీలు సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అత్యధిక ఓటు బ్యాంక్ కలిగిన బీసీలను కేవలం ఓట్లు వేయించుకునేందుకు మాత్రమే రాజకీయ పార్టీలు వినియోగించుకుంటున్నాయని, ఈ పరిస్థితిలో మార్పు రావాలన్నారు. బీసీల అభ్యున్నతి కోసం రాజకీయాల్లో బీసీ నాయకులను ప్రోత్సాహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, డాక్టర్ జేవీ నారాయణ, మహేష్, ఓ.వెంకటయ్యయాదవ్, గిద్దలూరు మండల అధ్యక్షుడు అద్దంకి మధుసూన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి

- కంభం సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ తులశమ్మ


కంభం పశువైద్యశాలను ప్రైవేట్ వ్యక్తి వాడుకోవడంపై ప్రశ్నిస్తున్న కోఆప్షన్ సభ్యుడు సలీం

కంభం: పంటల సాగుకు కంభం చెరువు నీటిని విడుదల చేయాలనిఇరిగేషన్ అధికారులకు ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ సూచించారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కంభం చెరువు ఆయకట్టు రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారని, అవసరమైన మేర నీటిని విడుదల చేయడంపై అధికారులు దృష్టి సారించాన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కంభం పంచాయతీ పరిధిలోని సాధుమియా వీధిలో ఇంకా ప్రారంభం కాని పశు వైద్యశాలలో ఓ ప్రైవేట్ వ్యక్తి తన టెంట్ హౌస్ సామగ్రి పెట్టుకున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని డిప్యూటీ ఎంపీడీఓను కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం ప్రశ్నించారు. తక్షణమే పశువైద్యుడిని నియమించి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని హితవుపలికారు. ఇరిగేషన్ కాలువల్లో పూడికను తీయించి చాలా చోట్ల పక్కనే పడేయడంతో రాకపోకలకు, నివాసితులకు అసౌకర్యంగా ఉందని, మండలంలో ఆధార్ కేంద్రాలు పనిచేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కోఆప్షన్ సభ్యుడితో పాటు కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు కొంతమేరే వినియోగించుకోవాలని చెబుతున్నారని, అలా చేస్తే తాము గ్రామంలో ఖర్చు పెట్టిన బిల్లుల సంగతి ఏమిటని చిన్నకంభం సర్పంచ్ రసూల్ ప్రశ్నించారు. గతంలో గోవిందాపురం వద్ద చెరువులో నీరు వృథాగా పోయిందని, నీటిని పొదుపుగా వినియోగించేలా ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, వైస్ ఎంపీపీలు హసీనా, రామ్మూర్తి, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబు


మార్కాపురం : బంగారు చీరలో వాసవీమాత మూలవిరాట్

మార్కాపురం టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు పశ్చిమ ప్రకాశంలోని ప్రముఖ ఆలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు, దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కాపురం పట్టణం రాజాజీ వీధిలోని వాసవీమాత ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు, మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు, సత్యనారాయణ స్వామి ఆలయంలో రమాదేవి అమ్మవారికి 9 రోజులపాటు విశిష్ట అలంకారాల్లో పూజలు చేయనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మార్కండేశ్వరస్వామి ఆలయంలో 22న అమ్మవారిని శైలపుత్రిగా, 23న బ్రహ్మచారిణి, 24న చంద్రఘంట, 25న కూష్మాండ దుర్గ, 26న మహాగౌరీ, 27న స్కందమాత, 28న కాత్యాయినీ, 29న కాళరాత్రి, 30న మహిషాసురమర్దిని, అక్టోబరు 1న సిద్ధిదాయిణి, 2న పార్వతీదేవిగా అమ్మవారిని అలంకరించనున్నారు.

ఆలయాలకు శరన్నవరాత్రి శోభ

బేస్తవారిపేట: బేస్తవారిపేట మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారు 22న కలశ స్థాపన, 23న అంబా భవానీదేవి, 24న భువనేశ్వరీదేవి, 25న గజలక్ష్మీదేవి, 26న రాజరాజేశ్వరీదేవి, 27న మీనాక్షిదేవి, 28న బాలా త్రిపురసుందరీ దేవి, 29న సరస్వతిదేవి, 30 మహిషాసుర మర్ధిని, అక్టోబర్ 1న బాలహృదయేశ్వరి, 2న మోహినీదేవి, 3న అన్నపూర్ణాదేవి, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు 22న చౌడేశ్వరీదేవి, 23న బాలత్రిపురసుందరీదేవి, 24న గాయత్రీదేవి, 25న కాత్యాయనిదేవి, 26న అన్నపూర్ణాదేవి, 27న లలితా త్రిపుర సుందరీదేవి, 28న మహాలక్ష్మీ దేవి, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, 1న మహిషాసురమర్దిని, 2న విజయలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్లలో రామదూతక్షేత్రం, పోలేరమ్మ ఆలయం, పెదారికట్లలో శివాలయం, మహాలక్ష్మమ్మ ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో విజయదశమి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి విగ్రహాలను రోజూ వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దసరా ఉత్సవాలకు 'అన్నా'కు ఆహ్వానం


అన్నా రాంబాబుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

మార్కాపురం: పొదిలి పట్టణంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు హాజరుకావాలని పొదిలి ఆర్యవైశ్య సంఘ నాయకులు వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును ఆహ్వానించారు. ఆదివారం మార్కాపురంలో అన్నా రాంబాబు నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రిక అందజేశారు.